www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 31 డిసెంబర్ 2023 | 5 | ఏలూరు




బెదిరింపు చర్యలు సిగ్గుచేటు

19వ రోజుకు అంగన్వాడీల సమ్మె

6లో..



కొయ్యలగూడెంలో అంగన్వాడీల నిరసన



తణుకులో వినతిపత్రం తీసుకుంటున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తాడేపల్లిగూడెంలో వినతిపత్రంలో అంశాలను చదువుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

మంత్రుల ఇళ్లను ముట్టడించిన అంగన్వాడీలు

విధుల్లో చేరకపోతే కొత్తవారిని పెట్టుకుంటామంటూ డిప్యూటీ సిఎం కొట్టు వ్యాఖ్యలు

తీవ్రంగా ఖండించిన అంగన్వాడీ, సిఐటియు నేతలు

సమస్యలు పరిష్కరించకుండా సమ్మె విరమించేది లేదని స్పష్టీకరణ

త్వరలోనే అంగన్వాడీల సమస్యలకు పరిష్కారం: మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

'సమ్మె విరమించి విధులకు హాజరుకండి.. లేకపోతే మిమ్మల్ని తొలగించి కొత్తవారిని పెట్టుకుంటాం..' అంటూ డిప్యూటీ సిఎం, రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి కొట్టు సత్యనారాయణ అంగన్వాడీలను హెచ్చరించారు. అంగన్వాడీలు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ శనివారం స్థానికంగా ఉన్న డిప్యూటీ సిఎం ఇంటిని ముట్టడించారు. ఈ క్రమంలో తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుండా ప్రభుత్వం మొద్దునిద్ర నటిస్తోందని పలువురు నేతలు విమర్శించారు. ఈ క్రమంలో బయటకు వచ్చిన డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ ఒక్కసారిగా అంగన్వాడీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆపై సిపిఎం, సిఐటియు నేతలు మిమ్మల్ని రెచ్చగొట్టి తన ఇంటి మీదకు పంపారనడంతో అంగన్వాడీలంతా ముక్తకంఠంతో ఖండించారు. తమ జీతాలు పెంచాలని 19 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. బెదిరింపు చర్యలు మానుకోకపోతే రానున్న ఎన్నికల్లో తగు గుణపాఠం చెబుతామని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ, కార్యదర్శి హసీనాబేగం, ప్రాజెక్టు అధ్యక్షురాలు స్వరూపరాణి హెచ్చరించారు. మంత్రి కొట్టు సిపిఎం నాయకులను, కార్మిక సంఘాల నేతలను చులకనభావంతో మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ క్రమంలో పోలీసులు సిఐటియు నేతలను అక్కడ నుంచి పక్కకు తీసుకెళ్లారు. సమస్యలు పరిష్కరించకుండా తాము విధుల్లో చేరేది లేదని అంగన్వాడీలు తేల్చిచెప్పడంతో మంత్రి ఇంట్లోకి వెళ్లిపోయారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని నేతలు హెచ్చరించారు. తమ డిమాండ్లన్నీ సంపూర్ణంగా పరిష్కరిస్తేనే సమ్మె విరమించి విధుల్లో చేరతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, అంగన్వాడీ నేతలు ప్రభారాణి, కనకమహాలక్ష్మి, వరలక్ష్మి, ప్రసన్న, గాయత్రి, వీరమ్మ, యడవల్లి వెంకన్న పాల్గొన్నారు.

సిఎం నివాసాన్ని ముట్టడిస్తాం

తణుకు రూరల్: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కళ్యాణి, సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, శ్రామిక మహిళా జిల్లా నాయకులు అడ్డగర్ల అజయకుమారి హెచ్చరించారు. శనివారం మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఇంటిని అంగన్వాడీలు ముట్టడించారు. జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని, మంత్రి వెంటనే రావాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసులు రంగంలోకి దిగి సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్‌ను బలవంతంగా పోలీస్ జీప్ ఎక్కించుకొని టౌన్ స్టేషన్‌కు తరలించారు. అయినా అంగన్వాడీలు అక్కడే బైఠాయించి మంత్రి వచ్చేవరకు ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమవరం వచ్చిన ముఖ్యమంత్రి కనీసం అంగన్వాడీల సమస్యలపై మాట్లాడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీల అమలు కోసం ఏ పోరాటానికైనా సిద్ధమన్నారు. మంత్రి కారుమూరి ఇంటికి చేరుకోగానే అంగన్వాడీలు ఆయనకు వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ 'మీ కోసం ఎక్కడో ఉన్న నేను.. వెంటనే వచ్చానని, మీ సమస్యలు ముఖ్యమంత్రికి తెలియజేశాను' అని తెలిపారు. సమస్యల పరిష్కారం త్వరలోనే జరుగుతుందన్నారు. 'చర్చల్లో నేను కూడా ఉంటున్నాను మీ సమస్యలు వెంటనే పరిష్కారం జరిగేలా కృషి చేస్తాను' అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు వైట్ల ఉషారాణి, నేతలు పాలా మాధవి, దీపిక రాణి, నాగలక్ష్మి, గంగాభవాని, రాజకుమారి, వసంత, నళినికుమారి, శ్యామల, నాగలక్ష్మి, ముసలమ్మ, ధనలక్ష్మి, రజని, లక్ష్మి పాల్గొన్నారు.

నల్ల దుస్తులతో మున్సిపల్ కార్మికుల నిరసన

ఐదో రోజుకు సమ్మె - జిల్లావ్యాప్తంగా విధులు బహిష్కరించి కార్మికులు ఆందోళన



ఏలూరులో..



నూజివీడులో..

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ కార్మికుల ఐదో రోజు సమ్మె సందర్భంగా శనివారం మహిళలు నల్లచీరలు, పురుషులు నల్ల చొక్కాలు ధరించి నిరసన తెలిపారు. సిఐటియు ఆధ్వర్యాన మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది సమ్మెలో పాల్గొన్నారు. ప్రభుత్వం మొండివైఖరి వీడాలని, ఆప్కాస్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇంజనీరింగ్ విభాగం సిబ్బందికి కనీస వేతనాలు, రిస్క్ అలవెన్స్, హెల్త్ అలవెన్స్, క్లాప్ ఆటోల డ్రైవర్లకు రూ.18,500 కనీస వేతనమివ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ ఐదు రోజులుగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం మొండివైఖరి వీడి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి లావేటి కృష్ణారావు, అంగులూరు జాన్‌బాబు, బంగారు వెంకటేశ్వరరావు, బండి రాజు, తానంకి జార్జి, నాగరాజు, నక్క కృష్ణ, మేతర పాప, మరియమ్మ, శీగల సత్యవతి, కాంతమ్మ, బండి భవాని, కోన మధుమతి, చంద్రావతి రాజమ్మ నాయకత్వం వహించారు. సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాధరావు, కాంగ్రెస్ నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, గౌడు రంగబాబు, దండబోయిన చంద్రశేఖర్, లంకా రామ్మోహన్‌రావు, కొమ్మన సాంబశివరావు, ఆమ్ ఆద్మీ నాయకులు చల్లగొళ్ల సురేష్‌బాబు సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలియజేశారు.

నూజివీడు : పట్టణంలో మున్సిపల్ కార్మికుల సమ్మె ఐదో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జయలక్ష్మి, గోవిందు, రాణి, పద్మ, రజని, పంగిడమ్మ, పుష్ప, రాజు, సాయి, జయరాం, రాజేంద్ర, చంద్రశేఖర్, గంగాధర్ పాల్గొన్నారు.

చింతలపూడి : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. చింతలపూడి పట్టణంలో నగరపంచాయతీ వద్ద కార్మికుల సమ్మె ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్వాడీ, వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ పూర్తిమద్దతు తెలిపింది. ఈ కార్యక్రమంలో నాగరాజు, పుష్ప, పద్మ, కమలమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి సమ్మె ఉధృతం

ఏలూరు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిరసనగా మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మెను ఈనెల 31వ తేదీ ఆదివారం నుంచి మరింత ఉధృతం చేస్తామని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా శనివారం ప్రెస్‌క్లబ్‌లో సమావేశంలో వారు మాట్లాడారు. ఐదు రోజులుగా పారిశుధ్య విభాగంలోనే సమ్మె నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా అత్యవసర విభాగాలైన తాగునీరు, వీధిలైట్లు, మలేరియా, టౌన్ ప్లానింగ్ తదితర విభాగాల్లో సమ్మె చేపడుతున్నట్లు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య తెలిపారు. ప్రధానంగా మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్కో కార్మికుడు నాలుగున్నర సంవత్సరాల కాలంలో రూ.3,18,000 చొప్పున నష్టపోయినట్లు వివరించారు. ఒక్క ఏలూరు నగరపాలక సంస్థలోనే 250 మంది దాదాపు రూ.ఎనిమిది కోట్లు నష్టపోయారన్నారు. ఇంజినీరింగ్ విభాగం వారికి నైపుణ్యంగల వేతనాలు ఇవ్వాల్సి ఉండగా నైపుణ్యం లేని వారి వేతనాలు కన్నా తక్కువ చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణం దీన్ని సరిచేయాలని వారు డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ విభాగం వర్కర్లకు స్కిల్డ్, సెమిస్కిల్డ్ వేతనాలు చెల్లించాలని, రిస్క్ అలవెన్స్, హెల్త్ అలవెన్స్ చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. 25, 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఇంజనీరింగ్ విభాగం కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో అత్యవసర విభాగాలు కూడా పూర్తిగా స్తంభింపచేస్తామని వారు తెలిపారు.

అత్యవసర విభాగంలో పనిచేసే కార్మికుల సమ్మె వల్ల ప్రజానీకానికి ఎలాంటి అసౌకర్యం కలిగినా దానికి ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని వారు వెల్లడించారు. ఈ సమావేశంలో మున్సిపల్ యూనియన్ నాయకులు ఎ.జాన్‌బాబు, లావేటి కృష్ణారావు, వినుకొండ రమేష్, ఏసునాథ్, సోమేశ్వరరావు, సత్యనారాయణ, రామారావు, కొండలరావు, రాజేష్, సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాధరావు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ముమ్మందుకు

2023లో పలు రంగాల్లో అద్భుత ప్రగతి

పామాయిల్, కోకో సాగు, పాల ఉత్పత్తిలో రాష్ట్రంలో మొదటిస్థానం

నూజివీడు, జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రులకు బెస్ట్ అవార్డులు

స్పందన అర్జీల పరిష్కారంలో రాష్ట్రంలో రెండు, మూడుస్థానాలు

జిల్లా అభివృద్ధిపై మీడియాతో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

2023వ సంవత్సరంలో ఏలూరు జిల్లా అనేక రంగాల్లో అభివృద్ధిలో ముందడుగు వేసిందని, అందుకు సంబంధించిన గణాంకాలే నిదర్శనమని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జిల్లాలో సాధించిన ప్రగతిపై శనివారం కలెక్టరేట్‌లో జిల్లా ఉన్నతాధికారులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత ఆయా శాఖల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కౌలురైతులకు గతేడాది 46,087 కౌలుకార్డులు జారీ చేసి రూ.63.38 కోట్లు పంట రుణాలు మంజూరు చేయగా, ఈ ఏడాది 60,322 మందికి కౌలుకార్డులు జారీ చేసి రూ.128.86 కోట్లు రుణాలు మంజూరు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు, ఇన్‌పుట్ సబ్సిడీ, వ్యవసాయ రంగంలో నూతనంగా అమలు చేసిన కార్యక్రమాలను వివరించారు. ఉద్యాన శాఖకు సంబంధించి ఈ ఏడాది జిల్లాలో 20,215 ఎకరాల్లో కొత్తగా ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచినట్లు తెలిపారు. కోకో సాగును అంతర్‌పంటగా 2,500 ఎకరాల్లో పెంచామని, దీనిలో కూడా ప్రథమస్థానంలో నిలిచామని వివరించారు. స్పందన అర్జీల పరిష్కారంలో రాష్ట్రంలో రెండు, మూడుస్థానాల్లో ఉన్నామని, 70 శాతం అర్జీలకు సంబంధించి సంతృప్తి ఉందని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి గోనె సంచుల ఏర్పాటు, ఆఫ్‌లైన్‌లో ధాన్య కొనుగోలులో ముందున్నామన్నారు. రంగుమారిన ధాన్యానికి సంబంధించి ఆదేశాలు వచ్చిన తర్వాత కొనుగోలు జరుగుతుందన్నారు. గోదావరి వరదలు, తుపాన్ల సమయంలో అధికార యంత్రాంగం సమర్ధవంతంగా పని చేసిందన్నారు. 106 గ్రామాల్లో రీసర్వే పూర్తయ్యిందన్నారు. అసైన్డ్ భూములు 11,716 ఎకరాలకు సంబంధించి 9,172 మంది పేద రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. ఇనాం, ఎస్‌సి కార్పొరేషన్, భూములకు సంబంధించి మేలు జరిగినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ రూ.25 లక్షలకు పెంచడంతోపాటు పిఎంఎజెవై కింద ఇకెవైసి చేయడంలో రెండో స్థానంలో నిలిచామన్నారు. జగనన్న సురక్షలో ప్రతి ఇంటికీ వెళ్లి వెళ్లి పని చేశామని, జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. నూజివీడు, జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రులకు బెస్ట్ అవార్డులు వచ్చాయన్నారు. నాడు-నేడు పనులు బాగా జరిగినట్లు వివరించారు. 38,393 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చామన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో చదివే జిల్లా విద్యార్థులు అనేక అంశాల్లో రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలిచారన్నారు. రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ, మెడికల్ అండ్ హెల్త్, విద్య, శిశుసంక్షేమశాఖ, డిఆర్‌డిఎ, మెప్మా, సోషల్ వెల్ఫేర్, బిసి కార్పొరేషన్, మైనార్టీ వెల్ఫేర్, విద్యుత్, పరిశ్రమలు, రవాణా, గృహనిర్మాణం, ఆర్అండ్‌బి, డ్వామా, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా వంటి పలుశాఖలకు సంబంధించిన ప్రగతి వివరాలను అందించారు. జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి మాట్లాడుతూ రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల్లో అభివృద్ధికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, సబ్‌కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్, ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ, వ్యవసాయశాఖ జెడి రామకృష్ణ, గృహనిర్మాణ శాఖ పీడీ రవికుమార్, వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఏలూరులో వినూత్నంగా నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు

అర్ధనగ్నంగా ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మెలో భాగంగా 11వ రోజు శనివారం స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద మహిళలు నల్ల దుస్తులు ధరించి, పురుషులు అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జెఎసి నేతలు మాట్లాడుతూ విద్యాశాఖలో కీలకపాత్ర వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు వారం రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సిఎం జగన్ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తాననే వాగ్దానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పిఆర్‌సి అమలు చేయకుండా నెలలు తరబడి వేతనాలు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనమివ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దుచేసి ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయాలన్నారు. అన్ని పోస్టులకు ఖచ్చితమైన జాబ్‌చార్ట్ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. సమగ్ర శిక్ష జెఎసి నాయకులు భగవాన్, కమలాకర్, పౌల్‌రాజు, క్రాంతి, దిలీప్, బాలాజీ, రాజు, సత్య, చినబాబు, వై.శ్రీనివాసరావు, వీరమణి, శ్యామల, జాన్సీ, వెంకట లక్ష్మీ, కుమారి కె.లక్ష్మీ కాంతం, భవానీ పాల్గొన్నారు.

సమ్మె విచ్ఛిన్న చర్యలు సిగ్గుచేటు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జానుబాబును, మరో తొమ్మిది మంది క్లాప్ ఆటోల డ్రైవర్లను శుక్రవారం అర్ధరాత్రి వెహికల్ ఇన్‌స్పెక్టర్ గదిలో బంధించి క్లాప్ వాహనాలను చీకటి దొంగల్లాగా తరలించిన మున్సిపల్ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ చర్యను ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. క్లాప్ ఆటోల డ్రైవర్లు ఆరు మాసాలుగా కనీస వేతనాలు అమలు చేయాలని, గుర్తింపు కార్డులు, యూనిఫారం ఇవ్వాలని, ఆదివారం సెలవులు, పండుగ సెలవులు అమలు చేయాలని ఆందోళన చేస్తున్నారని, వీటిని పట్టించుకోని కమిషనర్ ఇలాంటి చర్యలకు పాల్పడటం అన్యాయమన్నారు. లేబర్ అధికారుల ఆదేశాలు అమలు చేయలేని కమిషనర్, యాజమాన్యానికి వంతపాడుతున్నారని విమర్శించారు. తమ సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చి ఆందోళన చేస్తుంటే, సమ్మె విచ్ఛిన్నానికి పాల్పడడం దారుణమన్నారు. క్లాప్ ఆటోల సమస్యలపై అడుగుతుంటే అవి ఏజెన్సీకి సంబంధించినవని, తనకు సంబంధం లేదని చెప్పే కమిషనర్ అర్ధరాత్రి పోలీసుల సహాయంతో టెంట్‌లో పడుకున్నవారిని అక్రమంగా నిర్బంధించి ఆటోలు ఎలా తీసుకెళ్లారని ఆయన ప్రశ్నించారు. కమిషనర్ ప్రతాపం ఏమైనా ఉంటే మున్సిపాలిటీ సొమ్ము నెలకి రూ.15 లక్షలు అక్రమంగా కాజేస్తున్న కాంట్రాక్టర్ మీద చూపాలి, కానీ కార్మికులపై కాదని ఆయన హితవు పలికారు. మున్సిపల్ అధికారులు క్లాప్ ఆటోల కాంట్రాక్ట్‌ను రద్దుచేసి మున్సిపాలిటీ ద్వారా జీతాలు చెల్లించాలని, డ్రైవర్లకు జిఒ ప్రకారం రూ.18,500 వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వం మొండివైఖరి వీడాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, అక్రమ అరెస్టులను విరమించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 11 మున్సిపాలిటీలు 17 కార్పొరేషన్లలో పనిచేసే మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నారని, మున్సిపల్ కార్మికులు ఐక్యంగా ఉంటూ రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన సమ్మె విజయవంతంగా కొనసాగుతోందన్నారు. 2019 ఎన్నికల సమయంలో అధికారం కోసం సిఎం జగన్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరుతూ కార్మికులు చేపట్టిన సమ్మెకు సిపిఎం పూర్తిమద్దతు తెలియజేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించకుండా, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉద్యమాల విషయంలో చర్చలు జరిపి పరిష్కారానికి కృషి చేయాలి గానీ అణిచివేతకు ప్రయత్నించడం సరికాదని హితవుపలికారు. ప్రజలు తమ హక్కుల కోసం నిరసనలు తెలపడం రాజ్యాంగ హక్కు అని, దీన్ని హరించాలని చూస్తే గత ప్రభుత్వాలకు పట్టినగతే పడుతుందని హెచ్చరించారు. ఏలూరులో శాంతియుతంగా మున్సిపల్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెను భగ్నం చేసేందుకు నగర కమిషనర్ వ్యవహరించిన తీరు అనైతికమన్నారు. అర్ధరాత్రి సమయంలో పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగించి మున్సిపల్ క్లాప్ వాహనాలను తరలించడానికి చేసిన అక్రమ అరెస్టులను ఆయన తీవ్రంగా ఖండించారు. క్లాప్ వాహనాల డ్రైవర్లను మున్సిపల్ కార్మికులుగా గుర్తించాలని, జిఒ-7 ప్రకారం రూ.18,500 వేతనమివ్వాలని, పారిశుధ్య కార్మికులకు పనికి తగ్గ వేతనమివ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు పెండింగ్ ఎరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్‌లో నమోదైన 90 వేల మంది కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యల విషయంలో చర్చలు జరిపి సానుకూలంగా స్పందించాలని రవి డిమాండ్ చేశారు.

ఇంటా.. బయటా సెగలే..!

రెండు జిల్లాల్లోనూ అధికార పక్షమైన వైసిపికి ఇంటా.. బయటా సెగలు తప్పడం లేదు. ఎన్నికలు సమీపించిన వేళ సొంతింట్లో రాజుకుంటున్న అసమ్మతి సెగతో వైసిపి శ్రేణులే ఉలిక్కిపడుతున్నాయి. అదే సమయంలో నాలుగున్నరేళ్ల పాలనపై వివిధ తరగతుల్లో నెలకొన్న అసంతృప్తి ఏస్థాయిలో ఉందో వరుసగా సాగుతున్న అంగన్వాడీ, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెతోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయులు వివిధ రూపాల్లో చేపడుతున్న ఆందోళనలు చెప్పకనే చెబుతున్నాయి.

మరికొద్ది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న సమయంలో జిల్లాలో అధికారపక్షం ముప్పేట సమస్యలతో ఉక్కిరిబిక్కిరవుతోంది. ఓపక్క సమస్యలు పరిష్కారం కాక వివిధ తరగతుల ప్రజానీకంలో పెరిగిన అసంతృప్తిని ఎలా చల్లార్చాలో అర్థంకాక మల్లగుల్లాలు పడుతుంటే నియోజకవర్గ ఇన్‌ఛార్జీల మార్పు, సిట్టింగుల తిరుగుబాటుతో పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారైంది. చింతలపూడి ఎంఎల్‌ఎ ఎలిజాకు టిక్కెట్ ఇవ్వడం లేదనే వార్తలు ఆ నియోజకవర్గంలో నివురుగప్పిన నిప్పులా ఉన్న గ్రూపు విబేధాలను బహిర్గతం చేసింది. అంగన్వాడీలు ఎంఎల్‌ఎల ముట్టడిలో భాగంగా జంగారెడ్డిగూడెంలో ఎలిజా ఇంటిని ముట్టడించగా 'ఈ సమస్యతో నాకేంటి సంబంధం.. జగన్మోహన్‌రెడ్డికే సంబంధం' అని ఎంఎల్‌ఎ వ్యాఖ్యానించడం గమనార్హం. ఇక ఎలిజా అనుచరులు వైసిపి రీజియన్ కోఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి ఇంటి వద్ద బైఠాయించి ఎలిజాకే టిక్కెట్ ఇవ్వాలని నినదించడంతోపాటు 'జగన్ రావాలి.. ఎలిజా కావాలి' అంటూ ప్లకార్డులు ప్రదర్శించడం చర్చనీయాంశమైంది. మొత్తంగా పరిశీలిస్తే అధికారంలో ఎవరున్నా చింతలపూడి నియోజకవర్గం కొరకరాని కొయ్యగానే మారుతుందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇక పోలవరం నియోజకవర్గంలో పరిస్థితీ నివురుగప్పిన నిప్పులానే ఉంది. ఆచంట, ఉండి, నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జీల మార్పు తథ్యమని ప్రచారం జరుగుతుండటంతో పశ్చిమగోదావరి జిల్లాలోనూ అధికార పక్ష శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. ఎన్నికల నేపథ్యంలో ఈ పరిస్థితి నెలకొనడం ఆ పార్టీ నేతలు తీవ్ర కలవరపాటుకు గురవుతున్నారు.

ఇక అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్రశిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మెలో కొనసాగుతూ వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతున్నారు. అంగన్వాడీల ఆందోళన ప్రభుత్వాన్ని గుక్కతిప్పుకోనీయకుండా చేస్తుంటే మున్సిపల్ కార్మికుల సమ్మెతో పట్టణాల్లో పేరుకుపోతున్న చెత్త పాలకుల వైఫల్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఈ క్రమంలో అంగన్వాడీలపై అటు ప్రభుత్వం, ఇటు అధికారులు బెదిరింపుల పర్వానికి దిగుతుండటం చర్చనీయాంశమైంది. అంగన్వాడీల సమస్యలు ప్రభుత్వం పరిష్కరిస్తుందని, కచ్చితంగా ప్రభుత్వం న్యాయం చేస్తుందని పలువురు ఎంఎల్‌ఎలు, మంత్రులు చెబుతుంటే డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ మాత్రం 'విధుల్లో చేరకపోతే కొత్తవారిని పెట్టుకుంటాం' అంటూ బెదిరింపులకు దిగడం అంగన్వాడీల్లో ఆగ్రహావేశాలను పెంచింది. అటు అంగన్వాడీ లబ్ధిదారుల నుంచి సామాన్య ప్రజల వరకూ అంతా అంగన్వాడీల కోర్కెలు సమంజసమేనని చెబుతుంటే ప్రభుత్వం మొండి వైఖరి అవలంభించడం, ఇచ్చిన హామీని మార్చి చెప్పడం విమర్శలకు తావిస్తోంది.



ఏలూరు కలెక్టర్ రెండు సంవత్సరాల్లోపు చేరిన అంగన్వాడీలు వెంటనే విధుల్లో చేరకపోతే తొలగించాలని నోటీసుల జారీకి సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వడంపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఇక మున్సిపల్ అధికారులు బలవంతంగా చెత్త సేకరణ ఆటోలను వేరే కార్మికులకు అప్పగించి చెత్తను తరలించేందుకు చేస్తున్న ప్రయత్నాలు అపహాస్యం పాలవుతున్నాయి. ప్రభుత్వపెద్దల ఒత్తిడిని అధిగమించేందుకు అన్నట్లుగా ఒకటి, రెండు చోట్ల చెత్త ఎత్తించి ఫొటోలు తీయించి సమస్యను పరిష్కరించినట్లు చెప్పుకోవడానికే అన్నట్లు పరిస్థితి తయారైంది. ఇక ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ యుటిఎఫ్ ఇప్పటికే దశలవారీ ఆందోళనలకు పిలుపునిచ్చింది. అంటే ఓపక్క ఉద్యోగ, ఉపాధ్యాయులు, మరోపక్క కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టడం అధికారపక్షానికి ఇబ్బందికరమేనని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇవి ఇలా ఉంటే ప్రజా సమస్యలు మరోపక్క పెద్దఎత్తున పేరుకుపోయాయి. వెరసి అధికార పక్షమైన వైసిపికి రెండు జిల్లాల్లో ఇంటా, బయటా సెగ తప్పడం లేదని, వీటి నుంచి చాకచాక్యంగా బయటపడకపోతే వచ్చే ఎన్నికల్లో భంగపాటు తప్పదని రాజకీయ పరిశీలకులు ఘంటాపథంగా చెబుతున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

ప్రజాశక్తి
www.prajasakti.com

సమన్వయంతోనే అభివృద్ధి

నూజివీడు రూరల్:ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి పట్టణాభివృద్ధికి కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధికి సంబంధించి పలు తీర్మానాలు ఆమోదించారు. పలువురు అధికారులు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ఏలూరు అర్బన్:స్థానిక ఎఆర్‌డిజికె హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఉజ్వల సమక్షంలో యుటిఎఫ్ ఏలూరు నగర శాఖ ఆధ్వర్యంలో 2024 సంవత్సరం యుటిఎఫ్ డైరీ, అధ్యాపక దర్శిని, క్యాలెండర్, వాల్ స్టిక్కర్ శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఏలూరు జిల్లా కార్యదర్శి శివశంకరరావు, జిల్లా కౌన్సిలర్ కెవి.అప్పారావు, ఏలూరు నగర శాఖ అధ్యక్షురాలు షేక్ పర్వీన్ బేగం, ప్రధాన కార్యదర్శి రాజారావు జొన్నకూటి, కోశాధికారి కోరాడ కిరణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు డి.రామచంద్రరావు, పి.సోమరాజు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన సదస్సు

ఉంగుటూరు:ప్రతిఒక్కరూ పౌరహక్కులపై అవగాహన పెంచుకుని రాజ్యాంగ బద్ధమైన మన హక్కులను కాపాడుకోవాలని డిప్యూటీ తహశీల్దారు బొడ్డేపల్లి దుర్గాప్రసాద్ అన్నారు. చేబ్రోలు పంచాయతీ కార్యాలయంలో శనివారం సివిల్ రైట్స్ డే సందర్భంగా అవగాహన సమావేశం సర్పంచి రాంధే లక్ష్మీ సునీత అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీటీ హాజరై మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి బివి.రవిచంద్రకుమార్, సచివాలయం ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

5 వరకూ ఓటర్ల నమోదు

టి.నరసాపురం:జనవరి ఐదో తేదీ వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తహశీల్దార్ జెవి.సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఆన్‌లైన్ ద్వారా, బిఎల్‌ఒల ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. జనవరి 12వ తేదీ వరకు ఓటర్ల జాబితా పరిశీలన చేసి జనవరి 22వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు.

సెల్ టవర్ నిర్మాణం ఆపాలని ధర్నా

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని పల్లెర్లమూడి గ్రామ పంచాయతీ శివారు శోభనాపురం గ్రామంలో సెల్ టవర్ నిర్మాణం ఆపేయాలని సిపిఎం మండల కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ ఆధ్వర్యంలో గ్రామస్తులు శనివారం రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నిమ్మగడ్డ నరసింహ మాట్లాడుతూ పంచాయతీ, గ్రామ ప్రజల అనుమతి లేకుండా సెల్ టవర్ నిర్మాణం చేపట్టడం దారుణమన్నారు. గ్రామంలో చిన్నారులు, వయోవృద్ధులు, పాడి పశువులు రేడియేషన్ బారిన పడి అనారోగ్యం పాలవుతారన్నారు.

ఉపాధి పనుల సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - పోలవరం

ఉపాధి హామీ చట్టం సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం పోలవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జి.శ్రీను అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపిల జిల్లా సంఘం అధ్యక్షులు, పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ చట్టంలో గుర్తించిన పనులను నిబంధన ప్రకారం నాణ్యతగా చేయాలన్నారు. సోషల్ ఆడిట్ సిబ్బందికి సహకరించి సంపూర్ణంగా నిర్వహించి, మండలానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ పి గోవింద్, ఎపిఒ వెంకటేశ్వరరావు, సోషల్ ఆడిట్ టీం, ఆర్‌డబ్ల్యుఎస్ బి.రామకృష్ణ, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, ఎన్ఆర్ఇజిఎస్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - ముసునూరు

సిఎం జగన్ విద్యార్థులకు ఎన్నో సౌకర్యాలు సమకూరుస్తున్నారని జెడ్‌పిటిసి సభ్యులు డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన అన్నారు. మండలంలోని ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిపి కొండా దుర్గాభవాని వెంకట్రావు ఆధ్వర్యంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు జగనన్న స్ఫూర్తి భరోసా పథకం కింద శనివారం స్టడీ మెటీరియల్ అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండలాధ్యక్షులు నాగమల్లేశ్వరరావు, వైస్ ఎంపిపి గంగాధరరావు, ఎంపిడిఒ జి.రాణి, తహశీల్దార్ దాసరి సుధ, సర్పంచి కె.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రజల వద్దకు పాలన తీసుకొచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎంఎల్‌ఎ ఎలిజా అన్నారు. మండలంలోని ఉర్లగూడెంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క ఉర్లగూడెం పంచాయతీలోనే రూ.కోటితో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కోండిబోయిన యువరాజు, శ్రీనివాసరావు, చింతంపల్లి సర్పంచి రామకృష్ణ, రాంబబు, మిర్యాల దిలిప్ పాల్గొన్నారు.

చింతలపూడి ఎత్తిపోతల పనులు ప్రారంభించాలి

కొయ్యలగూడెం : చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ పనులను వెంటనే ప్రారంభించాలని సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో మంగపతిదేవిపేట గ్రామం నుంచి వెళ్తున్న చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ వద్ద రైతులు, గ్రామస్తులు, ఉపాధి హామీ కూలీలతో కలిసి శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ ద్వారా ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో వేలాది ఎకరాల పంటలకు నీరు సమృద్ధిగా ఉంటుందన్నారు. రైతు పండించే పంటకు సరైన నీరు అందకపోవడంతో పంట దిగుబడి తక్కువగా ఉంటుందన్నారు. కాలువ పనులు ప్రారంభించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిధులను విడుదల చేయాలని కోరారు. కాలువ పనులు ప్రారంభించి 12 సంవత్సరాలవుతుందన్నారు. కాలువ పనులు పూర్తి చేయడం వల్ల ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో ఉన్న రైతాంగానికి మేలు జరుగుతుందన్నారు. కాలువ పనులు త్వరగా పూర్తి చేయాలని, లేకపోతే రైతులతో కలిసి ఆందోళన చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గ్రామ పంచాయతీ సర్పంచి అబ్బు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న పంటలను పండించే భూములన్నీ కూడా కాలువపైనే ఆధారపడి ఉన్నాయన్నారు. వెంటనే కాలువ పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ తేలే శ్రీను, ఇళ్ల నర్సయ్య, రైతులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

త్వరలో వంద పడకల ఆసుపత్రి పూర్తి

ప్రజాశక్తి - చింతలపూడి

వంద పడకల ఆసుపత్రి త్వరగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలందిస్తామని ఎంఎల్‌ఎ ఎలిజా అన్నారు. పట్టణంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల, వంద పడకల ఆసుపత్రి పనులను ఆయన శనివారం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయలని ఆదేశాలు జారిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద పడకల ఆసుపత్రి నిర్మాణం చింతలపూడి ప్రజల చిరకాల వాంఛ అని, త్వరలోనే అది నేరవేరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిటీ మెడికల్ దుర్గారావు, దిలీప్ పాల్గొన్నారు.

బెదిరింపు చర్యలు సిగ్గుచేటు

19వ రోజుకు అంగన్వాడీల సమ్మె



ఏలూరు అర్బన్‌లో...



ప్రజాశక్తి - విలేకరులు

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారంతో 19వ రోజుకు చేరుకుంది. సమస్యలు పరిష్కరించేవరకూ ఉద్యమం ఆగదని వారు స్పష్టం చేశారు.

ఏలూరు అర్బన్:రెండేళ్ల లోపు సర్వీస్ ఉన్న అంగన్‌వాడీలు వెంటనే విధుల్లోకి చేరాలని, లేదంటే తొలగిస్తామని కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్ కాపీలను అంగన్‌వాడీలు దహనం చేసి నిరసన తెలిపారు. ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి అనేక ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఉద్యమాన్ని అణిచివేయాలని చూస్తే సరైన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడనాడి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల చేసే పోరాటానికి సిఐటియుగా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. యూనియన్ కార్యదర్శి దుర్గాభవాని, స్వప్న, మల్లిక, రామలక్ష్మి, వెంకటలక్ష్మి, సిఐటియు ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు పాల్గొన్నారు. సమ్మెకు ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు పి.మంగరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు మద్దతు తెలిపారు.

ముసునూరు : అంగన్‌వాడీలు చెవులు, నోరు, కళ్లు మూసుకుని నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామ సచివాలయం వద్ద గ్రామ సచివాలయం సెక్రటరీకి వినతిపత్రం అందించారు. ఉత్తర్వులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నూజివీడు ప్రాజెక్టు కార్యదర్శి పల్లి పాము రాజకుమారి, దుర్గ, మేరీ సులోచన, లక్ష్మి, విజయలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, శిరీష పాల్గొన్నారు.

మండవల్లి : మండవల్లి ప్రధాన సెంటర్ నుంచి సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించి సచివాలయం ముందు బైఠాయించి ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ లీడర్లు చెల్లమ్మ, వాణి, ఉమాదేవి, విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉత్తర్వులను దహనం చేశారు. అంగనవాడీల సంఘం నాయకులు షేక్ అబిదా బేగం, జక్కంశెట్టి మేనకలక్ష్మి, కొప్పినీడి రమాదేవి, అంగనవాడీ టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.



ముసునూరులో...

జంగారెడ్డిగూడెం : స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం వద్ద ఉత్తర్వులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల స్థాయి అంగన్‌వాడీ వర్కర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉంగుటూరు : ఉంగుటూరు జాతీయ రహదారిపై అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. సమ్మె చేస్తున్న వారికి వ్యతిరేకంగా ప్రభుత్వం ఇచ్చిన మెమో ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు నారపల్లి రమణరావు, మండల కార్యదర్శి సీరా అప్పారావు, అంగన్‌వాడీ నాయకులు, కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలో శిబిరం వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు, ఎం.శివరత్నకుమారి, అడప నాగజ్యోతి, బొబ్బర చిట్టి, ఎం.మంగ, ఎం.మాధవి, జె.నాగవేణి,షేక్ నూర్జహాన్, ఎం.పోసిరత్నం పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : బుట్టాయగూడెంలో ఐసిడిఎస్ పీడీ ఇచ్చిన ఉత్తర్వులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించకపోగా ఇటువంటి ఉత్తర్వులతో బెదిరింపులకు గురి చేయడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షురాలు కె.పుష్ప, రామలక్ష్మి, కృపామణి, సీత, మున్ని, వాణి, కన్నమ్మ, రామయమ్మ, మరమ్మ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : అంగన్వాడీ కార్యకర్తలు సిఐటియు ఆధ్వర్యంలో జీలుగుమిల్లి సచివాలయం వద్ద నిరసన తెలిపి పంచాయతీ కార్యదర్శి అశోక్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కారమయ్యేవరకు సమ్మె కొనసాగుతునే ఉంటుందని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి కొండలరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, ఎస్తేరు, సరళ, పూర్ణ పాల్గొన్నారు.

చాట్రాయి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం వద్దకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు చేరుకుని మాట్లాడారు. అనంతరం సమ్మె శిబిరం వద్ద నుంచి సెంటర్‌లో ఉన్న గ్రామ సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించి సోషల్ వెల్ఫేర్ కార్యదర్శి నాగేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రమీలరాణి, విజయ, నిర్మల, జ్యోతి, రాణి నాయకత్వం వహించగా సిఐటియు మండల నాయకులు మేడేపల్లి హోలీ మేరీ పాల్గొన్నారు.

నిడమర్రు : నిడమర్రులో సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు సందర్శించి మాట్లాడారు. అనంతరం నిడమర్రు మూడు రోడ్ల కూడలిలో రాస్తారోకో చేసి ఉత్తర్వులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.రామలక్ష్మి, ఎ.నాగమణి, సుభాషిని, వెంకటలక్ష్మి, ఎన్.పార్వతి, జయమ్మ, త్రివేణి, కుమారి పాల్గొన్నారు.

చింతలపూడి : పట్టణంలో ఫైర్‌స్టేషన్ వద్ద ఉత్తర్వులను దహనం చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్, వర్కర్స్ యునియన్ ప్రాజెక్టు సెక్రటరీ పి.మాణిక్యం మాట్లాడారు. తమ డిమాండ్లు నెరవేర్చేవరకు సమ్మె కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సరళ, కవిత, హేమలత, సరోజిని, సిఐటియు మండల అధ్యక్షులు నత్త వెంకటేశ్వరావు, బాలరాజు పాల్గొన్నారు.

టి.నరసాపురం : అంగన్వాడీలు సచివాలయం-1లో విఆర్‌ఒ వి.గోపీకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పి.ఫణివర్ధిని, ఎన్.మార్తమ్మ, ఎం.సత్యవతి, బాబి పాల్గొన్నారు.

నూరుశాతం బకాయి వసూల్లో ఉప్పరగూడెం సొసైటీ

రైతులకు విశిష్ట సేవలు



ఉప్పరగూడెం సొసైటీ భవనం


ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని ఉప్పరగూడెం సొసైటీ సేవల్లో ముందుంటూ రైతుల మన్ననలు పొందుతోంది. 2018-19, 2019-20, 2021-22, 2022-23 సంవత్సరాల్లో సంఘ సభ్యుల నుంచి రికవరీలో ప్రథమ స్థానం పొంది ఏటా అవార్డులు అందుకుంటోంది. సొసైటీ 1950లో ప్రారంభమైంది. సంఘం ఏర్పడినప్పటి నుంచి కూడా ఎన్నికలు జరుగుతూనే ఉన్నాయి. 1950 నుంచి 2013 వరకు సొసైటీ ఎన్నికలు జరిగాయి. 2013లో సొసైటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. సొసైటీ అధ్యక్షుల పర్యవేక్షణ, సిబ్బంది పనితీరు, సభ్యుల సహకారం ఉండడంతో గణనీయంగా డిపాజిట్లు పెరిగాయి.

ప్రస్తుతం సంఘ సభ్యులు 419 మంది ఉన్నారు. డిపాజిట్లు రూ.11.38,169, షేర్ ధనం రూ.26,17,640, ఇన్వెస్ట్‌మెంట్ రూ.29,13,036, సంఘానికి రావాల్సిన రుణాలు రూ.5,63,33,731 కోట్లు, సంఘం బ్యాంకుకు రూ.5,78,14,249 కోట్లు చెల్లించాల్సినవి, సంఘ సభ్యులకు ఇచ్చిన రుణాలు రూ.5,63,33,731 నూటికి నూరు శాతం వసూలు చేశారు. 2021-22 సంవత్సరంలో సంఘ సభ్యులకు రూ16.35 కోట్ల రుణాలు అందించారు.

వార్షిక టర్నోవర్ రూ.6.76 కోట్లు

సహకార బ్యాంకులో వార్షిక టర్నోవర్ రూ.6.76 కోట్ల వ్యాపారం నడుస్తోంది. పంట రుణాలు, చేపల మేత వివిధ రకాల రుణాలు మంజూరు చేస్తున్నారు. ఉప్పరగూడెం, విశ్వనాద్రిపాలెం, పెదగొన్నూరు, వణుదుర్రు గ్రామాల రైతులకు, ప్రజలకు సేవలందిస్తోంది. రైతులకు, ప్రజలకు చేయూతనిస్తూ రైతాంగాన్ని అన్నివిధాలా ఆదుకుంటూ సొసైటీని ముందుకు నడిపిస్తున్నారు.



అవార్డు అందుకుంటున్న సొసైటీ ప్రెసిడెంట్ పూర్ణచంద్రరావు

నూరు శాతం బకాయిలు వసూలు

శ్రావణం పూర్ణచంద్రరావు, సొసైటీ అధ్యక్షులు



ఉప్పరగూడెం సొసైటీ పరిధిలో 229 మంది సంఘ సభ్యుల నుంచి రావాల్సిన బకాయిలను నూటికి నూరు శాతం వసూలు చేశాం. 2022-23 సంవత్సరంలో రూ.2.84 కోట్లు సంఘ సభ్యుల నుంచి వసూలు చేశాం. గత నాలుగేళ్లుగా నూటికి నూరు శాతం బకాయిలు వసూలు చేస్తున్నాం. సొసైటీ ద్వారా రైతులకు విస్తృత సేవలు అందిస్తున్నాం.

సొసైటీ అభివృద్ధికి కృషి

యు.వెంకటేశ్వరరావు, సొసైటీ సిఇఒ



అధ్యక్షులు, సిబ్బంది కృషి, సభ్యుల సహకారంతో సంఘాన్ని నిర్వహిస్తున్నాం. 2018-19, 2019-20, 2020-21, 2021-22 సంవత్సరం పాటు సంఘ సభ్యుల నుంచి నూటికి నూరు శాతం బకాయిలు వసూలు చేస్తున్నాం.

డివైఎఫ్ఐ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు యువతలో చైతన్యం కలిగించే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని తహశీల్దార్ స్లీవజోజి అన్నారు. స్థానిక భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘం జిల్లా నాయకులు ఎస్‌కె.మాబుసుభాని అధ్యక్షతన తహశీల్దార్ కె.స్లీవజోజి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ స్లీవజోజి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రతిఒక్కరూ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జూద క్రిడలకు, మాదక, ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో యువతకు చేసే కార్యక్రమాలు ఆదర్శనీయమని సంఘాన్ని అభినందించారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే నూతన సంవత్సర, సంక్రాంతి ఆటల పోటీల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.వెంకట్రాజు, శ్రీను, డివైఎఫ్ఐ పూర్వ నాయకులు ఎం,జీవరత్నం, బొడ్డు రాంబాబు, పి.శ్రీనివాస్, నాని పాల్గొన్నారు.

కొబ్బరి మద్దతు ధర కంటి తుడుపు చర్య

ప్రజాశక్తి - ఏలూరు


2024 సీజన్‌కు సంబంధించి కొబ్బరికి కేంద్ర ప్రభుత్వం పెంచిన కనీస మద్దతు ధర క్వింటాల్ మిల్లింగ్ కొబ్బరికి రూ.300, బంతి కొబ్బరికి రూ.250 కొబ్బరి రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాదని, ఇది కంటి తుడుపు చర్య మాత్రమే అని ఆంధ్రప్రదేశ్ కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. స్థానిక పవర్‌పేటలోని అన్నే భవనంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కొబ్బరి మద్దతు ధరపై ఆయన శనివారం మాట్లాడారు. కొబ్బరి రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రాక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మార్కెట్ మాయాజాలంతో కొబ్బరి రైతులు నలిగిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. క్వింటాల్ కొబ్బరికి కనీస మద్దతు ధర రూ.15 వేలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధర కల్పించాలని కోరారు.

కన్నీటి సుడులు.. ఆగని దారుణాలు..!

ఈ ఏడాది కుదిపేసిన రోడ్డు ప్రమాదాలు - ఆగని హత్యలు.. పెరిగిన చోరీలు - రెచ్చిపోయిన సైబర్ నేరగాళ్లు - దోపిడీ దొంగల బీభత్సం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్


ఏఏటికాయేడు జిల్లాలో దారుణాలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. రోడ్డు ప్రమాదాల నుంచి హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు, దొంగతనాలు, దళితులపై దాడులు, సైబర్ నేరాలు ఇలా అనేక ఘటనలు జిల్లాను ఈ ఏడాది కూడా కుదిపేశాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది దారుణాల సంఖ్య భారీగా పెరిగింది. జిల్లాలో నిత్యం ఏదో-చోట రోడ్డు ప్రమాదం జరుగుతూనే ఉంది. అనేక దారుణాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి



తిరిగి వచ్చేవరకూ కుటుంబ సభ్యులు బిక్కుబిక్కుమంటూ ఎదురుచూడాల్సి వస్తోంది. ఉదయం బస్సులో స్కూల్‌కు వెళ్లిన పిల్లలు తిరిగి వచ్చేవరకూ తల్లిదండ్రులకు కంటిమీద కునుకు ఉండటం లేదు. ఇంటిని వదిలి బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంటిలోని విలువైన సామగ్రి ఉంటుందో.. లేదోననే భయం ఇంటి యజమానుల్లో నెలకొంది. రాత్రిసమయంలో ఒంటరిగా ప్రయాణించాలంటే దారిదోపిడీ దొంగల భయంతో వణకాల్సిన పరిస్థితి జిల్లాలో నెలకొంది. ఇలాంటి దారుణపరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు.



ఈ ఏడాది జిల్లాలో అనేక కుటుంబాల్లో తీరని విషాదమే అలముకుందని చెప్పొచ్చు. ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు.. అనేక కుటుంబాలు రోడ్డునపడ్డాయి. ఎందరో హత్యలు, హత్యాచారాలకు గురయ్యారు. వీటిని అడ్డుకోవడానికి అటు పోలీసులు ఇటు రవాణా శాఖ అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఈ దారుణాలు అదుపులోకి రావడం లేదు. అవగాహనా లోపమో, మద్యం మత్తులోనో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాలు జిల్లాను కుదిపేశాయి. రహదారులు రక్తసిక్తమయ్యాయి. 2021లో 618 రోడ్డు ప్రమాదాలు సంభవిస్తే ఈ ఏడాది ఏకంగా 635 ప్రమాదాలు జరిగాయి. 2022లో 633 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. నూజివీడు, పోలవరం, జంగారెడ్డిగూడెం



సబ్ డివిజన్లలో జరిగిన ప్రమాదాల కన్నా ఏలూరు సబ్ డివిజన్లో ప్రమాదాలు 30 శాతం అధికంగా ఉన్నాయి. ఈ ప్రమాదాలలో గతేడాదితో పోలిస్తే మృతుల సంఖ్య కూడా పెరిగింది. అనేకమంది క్షతగాత్రులయ్యారు. గతేడాది జరిగిన 633 రోడ్డు ప్రమాదాల్లో 255 మంది ప్రాణాలు కోల్పోయారు. 640 మంది గాయపడ్డారు. ఈ ఏడాది 635 ప్రమాదాల్లో 277 మంది మృతి చెందారు. 620 మంది గాయాల పాలయ్యారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మృతులు, క్షతగాత్రుల సంఖ్య 0.32 శాతం అధికంగా నమోదైంది. ఏడాది డిసెంబర్‌లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదం రాష్ట్రంలో తీరని విషాదాన్ని నింపింది. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం చెరుకువాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి రోడ్డు ప్రమాదాలు అనేకం జరిగాయి. ఏలూరు సబ్ డివిజన్‌లో 115 మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారు. 2005 మంది క్షతగాత్రులయ్యారు. జంగారెడ్డిగూడెం డివిజన్‌లో 49 మంది మృతిచెందారు. 85 మంది గాయపడ్డారు. పోలవరం డివిజన్‌లో 43 మంది ప్రాణాలు కోల్పోగా 84 మంది గాయపడ్డారు. నూజివీడు డివిజన్‌లో 70 మంది మృత్యువాతపడ్డారు. 194 మంది గాయపడ్డారు. జాతీయ రహదారుల్లో రోడ్డు ప్రమాదాల నివారనకు ఇటు రవాణా శాఖ అధికారులు అటు పోలీసులు సంయుక్తంగా స్పీడ్ గన్ వినియోగిస్తున్నారు. దీని ద్వారా జరిమానాలు విధిస్తున్నప్పటికీ వాహనాల వేగానికి కళ్లెం పడటం లేదు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కూడా పోలీసులు కోరఢా ఝళిపిస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మద్యం తాగి వాహనాలు నడిపి జరిమానాలు విధింపబడిన వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారిలో యువత సంఖ్య అధికం.

ఆగని హత్యలు.. పెరిగిన చోరీలు..
రెచ్చిపోయిన సైబర్ నేరగాళ్లు

ఈ ఏడాది జరిగిన హత్యలు జిల్లాను కలవరపరిచాయి. గతేడాదికి పోటీగా ఈ ఏడాది 31 మంది హత్యకు గురయ్యారు. 2021లో 23, గతేడాది 32 హత్య కేసులు నమోదయ్యాయి. సైబర్ నేరాలు గణనీయంగానే నమోదయ్యాయి. వారి వలలో చిక్కుకుని అనేక మంది ఘోరంగా మోసపోయారు. 2021లో 51 సైబర్ నేరాలు నమోదుకాగా ఈ ఏడాది 71 కేసులు నమోదయ్యాయి. ఇళ్లల్లో చోరీలు సైతం భారీగా జరిగాయి. 2021లో 35 చోరీ కేసులు నమోదుకాగా 2021లో 34, ఈ ఏడాది 40 చోరీ కేసులు నమోదయ్యాయి.

అలాగే అదనపు కట్నం వేధింపుల కేసులు గతేడాది ఎనిమిది, ఈ ఏడాది ఆరు నమోదయ్యాయి. అత్యాచారాల కేసులు 2021లో 26, గతేడాది 29, ఈ ఏడాది 25 కేసులు నమోదయ్యాయి. ఓ దారిదోపిడీ కేసు కూడా నమోదైంది. అర్ధరాత్రి దోపిడీలు సైతం భారీగా పెరిగాయి. గతేడాది 178కాగా ఈఏడాది 150 కేసులు నమోదయ్యాయి. పోక్సో కేసులు 35, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు 97, చీటింగ్ కేసులు 302 ఈ ఏడాది

శాంతి భద్రతల పర్యవేక్షణకు నిరంతర కృషి

జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి

శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నాం. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది కొన్నిరకాల నేరాలు తగ్గాయి. దిశా చట్టాన్ని అమలు పరచడంలో జిల్లా పోలీసుల తీరు మెరుగ్గాఉంది. యాసిడ్ దాడిలో మహిళ మృతిచెందితే 117 రోజుల్లో నిందితులకు జీవిత ఖైదు విధించేలా జిల్లా పోలీసులు చర్యలు చేపట్టారు. గంజాయి మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నాం. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక కృష్టిసారించి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. మద్యం సేవించి వాహనాల నడుపుతున్న వారిపై హత్యాయత్నం కేసులు కూడా నమోదు చేస్తున్నాం. రౌడీ షీటర్ల కదలికలపై పూర్తిస్థాయి నిఘా ఉంచాం. మహిళల భద్రతకు పెద్దపీట వేశాం.

జిల్లాలో దారుణాలివే..

సంవత్సరం	2021	2022	2023
హత్యలు	23	32	31
అదనపు కట్నం మరణాలు	6	8	6
అత్యాచారాలు	26	29	25
హత్యాయత్నాలు	43	55	51
దారిదోపిడీలు	1	1	1
ఇళ్లల్లో చోరీలు	35	34	40
అర్ధరాత్రి చోరీలు	156	178	150
మహిళలపై నేరాలు	1072	1527	1282
పోక్సో కేసులు	64	51	35
ఎస్‌సి, ఎస్‌టి కేసులు	64	51	35
చీటింగ్ కేసులు	263	314	302
సైబర్ నేరాలు	51	75	71
రోడ్డు ప్రమాదాలు	618	633	635

నేరాలు - ఘోరాలు

కారు, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని కొన్నంగుంట వద్ద కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ వైపు వెళ్తున్న కారు, విజయవాడ రూరల్ మండలం నున్న నుంచి నూజివీడు వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.